క్లుప్తంగా

కమిషనర్‌గా బాధ్యతల స్వీకరణ



నగర కమిషనర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్‌గా కలెక్టర్ పి.ప్రశాంతి అదనపు బాధ్యతలను శనివారం స్వీకరించారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్‌లో చార్జ్ తీసుకున్నారు. ఇప్పటి వరకూ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన కమిషనర్ కేతన్‌గార్గ్ విశాఖపట్నం బదిలీ అయిన విషయం విదితమే. ఈ మేరకు నూతన కమిషనర్ వచ్చే వరకు కలెక్టర్ ప్రశాంతి బాధ్యతలు నిర్వర్తించనున్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంసీ అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, మేనేజర్ ఎండి అబ్దుల్ మాలిక్ పాల్గొన్నారు.

నర్సరీ రైతుల నైపుణ్యం అద్భుతం



మంత్రి జనార్దనరెడ్డికి స్వాగతం పలుకుతున్న నర్సరీ అధినేత పుల్లా ఆంజనేయులు

కడియం: మండలంలోని నర్సరీ రైతుల నైపుణ్యం అద్భుతమని ఆర్‌అండ్‌బీ శాఖామంత్రి మంత్రి బి.జనార్దనరెడ్డి అన్నారు. శనివారం ఆయన మండలంలోని కడియపులంకలోని పుల్లా ఆంజనేయులుకు చెందిన శ్రీ సత్యదేవ నర్సరీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలికిన రైతులు వివిధ రకాల మొక్కల విశేషాలను వివరించారు. వేలాది రకాలను స్థానికంగా అభివృద్ధి చేస్తున్న రైతుల నైపుణ్యాలను మంత్రి అభినందించారు. అనంతరం మార్గాని సత్యనారాయణకు చెందిన శ్రీ వీరహనుమాన్ నర్సరీని కూడా మంత్రి సందర్శించారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు

పెదపూడి: సంపర గ్రామంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారికి జ్యేష్ఠ మాసం బహుళ ఏకాదశి శనివారం సందర్భంగా పంచామృతాభిషేకం పూజలు చేశారు. ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి తులసిదళాలతో విశేష, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారికి దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చింతయ్య

దేవరపల్లి: నల్లజర్లలోని ప్రధాన కూడలి ప్రాంతంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ముందు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి కారు ఢీకొంది. ఈ ఘటనలో మండలంలోని పుల్లలపాడుకు చెందిన కొక్కిరిపాటి చింతయ్య, దిర్శిపాం పండు గాయపడ్డారు. ఆయిల్‌పామ్ గెలలు కోయడానికి దేవరపల్లి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను చికిత్స కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా చింతయ్య ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది. ప్రమాద ఘటనపై ఫిర్యాదు అందలేదని నల్లజర్ల పోలీసులు తెలిపారు.

నారుమడిలో ఎరువుల యాజమాన్య పద్ధతులు

పెరవలి: ఆకుమడులు త్వరగా మొలకెత్తాలనే ఉద్దేశ్యంతో రైతులు ఎరువులు అధికంగా వేయడం, అలాగే తెగుళ్ల నివారణకోసం విచక్షణా రహితంగా పురుగు మందులను వినియోగిస్తున్నారని వ్యవసాయాధికారి మేరీ కిరణ్ తెలిపారు. సార్వా పంటలో ఆరోగ్యవంతమైన నారుమడి పెంచడానికి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎరువుల యాజమాన్య పద్ధతులు ఆమె వివరించారు.. నారుమడి వేసే 10 రోజుల ముందే దమ్ము చేసి చేనును చదును చేయాలి. నీరు పెట్టటానికి, తీయటానికి అనువుగా బోదెలను ఏర్పాటు చేయాలి. 5 సెంట్ల నారుమడికి 2 కిలోల నత్రజని (ఒక కిలో విత్తనం చల్లే ముందు ఆ తరువాత విత్తిన 12 రోజులకు మరోకిలో చల్లాలి) ఒక కిలో భాస్వరం, ఒక కిలో పోటాష్ ఎరువులను దుక్కిలోనే వేయాలి. విత్తనాలు చల్లిన తరువాత మొలక వచ్చిన అనంతరం ఒక ఆకు పూర్తిగా విచ్చుకొనే వరకు ఆరుతడులు నీరు ఇచ్చి ఆ తరువాత పలచగా నీరును కట్టాలి. నారుమడిలో జింక్ లోపాన్ని గమనిస్తే లీటరు నీటికి 2 గ్రాములు జింకు సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. విత్తిన 10 రోజులకు కార్బోఫ్యూరాన్ 3జి గులికలను సెంటు నారుమడికి 160 గ్రాములు చొప్పున వేయాలి లేదా నారుతీయటానికి 7 రోజుల ముందు గులికలను వేయాలి. అలాగే నాట్లు వేసేటప్పుడు నారుకట్టలుగా ఉన్నప్పుడే నారు ఆకుల చివర్లను తుంచి నాట్లు వేయాలి. దీంతో ఆకులపై ఉన్న తెగుళ్ల కారకాల గుడ్లు నాశనమవుతాయి. ఈ విధంగా నారుమడిని పెంచి నాట్లు వేసుకోవాలి.

మొక్కవోని దీక్ష

- నేరుగా చెట్లనే నాటుతున్న రాజమండ్రి రైజింగ్ బృందం
- నగరాన్ని హరితవనంగా మార్చడమే లక్ష్యంగా కృషి
- వారు నాటిన మొక్కలు నేడు మహావృక్షాలుగా ఎదిగిన వైనం



మొక్క నాటుతున్న రాజమండ్రి రైజింగ్ టీం సభ్యులు



చిరు వ్యాపారులకు నీడనిస్తున్న చెట్టు

కంబాలచెరువు: నగరాన్ని హరితవనంగా మార్చి పచ్చదనంతో కళకళలాడేలా చేయడమే లక్ష్యంగా రాజమండ్రి రైజింగ్ బృందం కృషి చేస్తోంది. వారు నాటిన మొక్కలే నేడు పెద్ద చెట్లుగా మారి పాదచారులకు, చిరు వ్యాపారులకు నీడనిస్తున్నాయి. ఒక మొక్క నాటాలంటే రూ.800 నుంచి రూ.1000 ఖర్చు అవుతుంది. నాటిన మొక్కకు సంరక్షణగా ఐరన్ లేక సిమెంట్‌తో ట్రీ గార్డ్‌ను ఏర్పాటు చేయాలి. వాటికి తప్పని సరిగా ఆరు నెలల వరకు నీళ్లు వేయాలి. ఆ మొక్క పది అడుగులు ఎత్తు పెరిగే వరకు వాటి బాగోగులు చూసుకోవాల్సిన బాధ్యత తీసుకోవాలి. అంతటి సమయం ప్రభుత్వానికి, అధికారులకు, స్థానికులకు ఉండదు. అటువంటి వ్యయప్రయాసల కోర్చి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతూ అందరికీ ఉపయోగపడే విధంగా ముందుకు సాగుతున్నారు రాజమండ్రి రైజింగ్ బృందం. 2014 అక్టోబర్‌లో వచ్చిన స్వచ్ఛభారత్ అనే నినాదాన్ని తీసుకుని రాజమండ్రిలో క్లీన్ డ్రైవ్ క్లీనప్ డ్రైవ్ అనే స్వచ్ఛ నినాదంతో ఈ బృందం ఏర్పడింది. అప్పటి నుంచి పర్యావరణ పరిరక్షణకు, పరిశుభ్రతకు కృషి చేస్తున్నారు. ఈ బృందానికి టీం లీడర్‌గా వ్యవహరిస్తున్న మాటూరి సిద్ధార్థ కృషి ఎనలేనిది.

నేరుగా చెట్లనే తీసుకువచ్చి..

ఒక మొక్క నాటాలంటే కొంతకాలం పాటు వ్యయ, ప్రయాసలు తప్పడం లేదు. అదే ఒక చెట్టునే నేరుగా తీసుకువచ్చి నగరంలోని అవసరమైన ప్రాంతంలో పాతితే చాలా ఖర్చు తక్కువ అవుతుందనే ఆలోచన టీం లీడర్ మాటూరి సిద్ధార్థకు వచ్చింది. ఆ ఆలోచనతో నర్సరీల్లో పెరిగి ఉన్న ఆరు నెలల మొక్కను తీసుకువచ్చి మొదటి ప్రాజెక్టుగా గోదావరి గట్టు ప్రాంతంలోని కంభం సత్రం వీధిలో నాటారు. అది సక్సెస్ కావడంతో వెంటనే మరో 16 చెట్లు తీసుకువచ్చి బ్లాక్ సాయిల్, ఎర్రమట్టి, నల్ల మట్టి, వెర్మీకంపోస్ట్ కలిపిన మిశ్రమాన్ని బస్తాలతో తీసుకొచ్చి ఆ చెట్లకు వేసి పెంచారు. అవి నేడు పెద్ద చెట్లుగా మారాయి. తర్వాత రాజమండ్రి రైజింగ్ బృందం 2017 నుంచి సుమారు 300 పైగా చెట్లను పాతారు. వాటిలో కోటగుమ్మం సెంటర్, లాంచీల రేవు, శ్యామల సెంటర్, ప్రధాన పోస్ట్ ఆఫీస్, సెంటర్ కందకం రోడ్డు సెంటర్ వంటి ప్రాంతాల్లో పాతిన చెట్లు నేడు చిరు వ్యాపారులకు నీడనందిస్తున్నాయి. కొన్నిచోట్ల స్థానికుల కోరిక మేరకు పండ్లు, పూల మొక్కలను నాటుతున్నట్టు వారు తెలిపారు. మొదట్లో వీటి ఖర్చు అంతా అడ్మిన్ మాటూరి సిద్ధార్థ భరించేవారు. నగరం మీద ఉన్న ప్రేమతో ఆయన తన మిత్రులైన మండవిల్లి హరినాథ్, నామన శ్రీకాంత్, మద్ది నారాయణరావు, సౌమ్యులు తమ వంతు సాయం చేస్తామని ఈ కార్యాచరణలో భాగస్వాములయ్యారు.

హరితవనంలా తీర్చిదిద్దుతాం



త్వరలో రానున్న 2027 గోదావరి నది మహా పుష్కరాలకు నగరాన్ని హరితవనంలా తయారు చేస్తాం. నగరానికి వచ్చే కోట్ల మంది పర్యాటకులకు, భక్తులకు రాజమహేంద్రవరం గుర్తుండిపోయేలా, రెండేళ్ల వ్యవధిని దృష్టిలో పెట్టుకొని దాతల సహకారంతో అనేక చెట్లు నాటేందుకు కృషి చేస్తున్నాం.

– మాటూరి సిద్ధార్థ, రాజమండ్రి రైజింగ్ టీం అడ్మిన్

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి



కళాశాలలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ రాఘవ కుమారి, తదితరులు

సీటీఆర్ఐ: పర్యావరణాన్ని పరిరక్షించుకోవడానికి చెట్లను పెంచవలసిన అవసరం ఎంతైనా ఉందని ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాఘవ కుమారి అన్నారు. శనివారం 'స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి శుభ్రం చేశారు. అనంతరం, కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను తెలియజేస్తూ, నినాదాలతో దానవాయిపేట ప్రాంతంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ రాఘవ మాట్లాడుతూ ' మన చుట్టూ ఉన్న ప్రాంతాలని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అది కళాశాలైనా మన గృహమైనా ఒక్కటేనన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని కళాశాల ప్రాంగణాన్ని పరిశుభ్రం చేయడం అభినందనీయమన్నారు. రెడ్ క్రాస్ యూత్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల ధాన్యం డబ్బులేవీ?

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు



కడియం: ధాన్యం విక్రయించిన రైతులకు 48 గంటల్లోనే డబ్బులు చెల్లిస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ బీరాలు పలికారని, ఇప్పటి వరకు 960 గంటలైనా రైతులకు డబ్బులు అందలేదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు) అన్నారు. శనివారం ఆయన కడియంలో స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. మండలంలో సుమారు 100 మందికి పైగా రైతులకు రూ.2.50 కోట్ల సొమ్ము అందాల్సి ఉందన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సాగు ముందుకు వెళ్లాలంటే గత పంట సొమ్ము చేతిలో ఉంటే రైతులు పెట్టుబడులకు ఆసరాగా ఉంటుందని అన్నారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో రైతులంతా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ధాన్యం కొనుగోళ్లకు సీలింగ్ పెట్టడంతో కళ్లాల్లో ధాన్యంతో రైతులు అవస్థలు పడ్డారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసారని గిరజాల గుర్తు చేసారు. గత దాళ్వా సీజనల్‌లో కేవలం 48 మందికి మాత్రమే పంటల బీమాను ప్రభుత్వం చెల్లించిందన్నారు. కడియం ఆవలో ముంపు ప్రమాదం అంచున వేలాది ఎకరాల భూమి ఉందన్నారు. పంటల బీమా పథకం సక్రమంగా అమలు చేస్తే నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. తొలకరి సీజన్‌కు సంబంధించి బీమా పథకాన్ని అరకొరగానే చెల్లించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని ఆయన అన్నారు. రైతులందరి పేరిట పంటల బీమా ప్రీమియం ప్రభుత్వం చెల్లించాలని ఆయన డిమాండ్ చేసారు. బోర్ల ద్వారా వ్యవసాయం చేసుకునే మెరక రైతులకు నీటితీరువా వసూలు చేయడం ఎంత వరకు సమంజసమని గిరజాల ప్రశ్నించారు. రైతులకు ఎన్నో సేవలందించే ఆర్‌బీకేలను గత ప్రభుత్వానికి పేరు వస్తుందన్న అక్కసుతో ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కి రైతులను చిన్నచూపు చూస్తోందని గిరజాల బాబు అన్నారు.

పంట మార్పిడితో భూసార పరిరక్షణ



శిక్షణ తరగతులలో పాల్గొన్న సహకార సంఘాల ప్రతినిధులు

రాజానగరం: పంటల మార్పిడి విధానాన్ని అవలంభించి సాగు చేయడం ద్వారా భూసారాన్ని పరిరక్షించడంతోపాటు మంచి దిగుబడులు పొందవచ్చని దివాన్‌చెరువులోని జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ అన్నారు. కోనసీమ జిల్లాలోని 15 వ్యవసాయ సహకార పరపతి సంఘాల ప్రతినిధులకు సర్టిఫికెట్ కోర్సులో భాగంగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులలో శనివారం 'భూసారం పెంపుదలకు పంట మార్పిడి' అనే అంశంపై అవగాహన కలిగించారు. వివిధ రకాల పంటలకు ఎరువులను ఏవిధంగా వాడాలి, సేంద్రియ ఎరువుల వర్గీకరణ వంటి వాటిపై మరో శాస్త్రవేత్త డాక్టర్ చల్లా వెంకటనరసింహరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

ప్రశంసాపత్రంలో కానరాని 'చిన్నమ్మ' ఫొటో



చిన్నమ్మ పురందేశ్వరి ఫొటో లేకుండా ముద్రించిన ప్రశంసాపత్రం

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట జాతీయ రహదారిపై శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మండలస్థాయి యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పాల్గొని యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ ప్రశంసాపత్రంలో ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్ ఫొటోతో పాటు రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఫొటో ముద్రించారు. రాజమండ్రి ఎంపీ, రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఫొటోను విస్మరించారు. ఈ ప్రశంసాపత్రంలో పురందేశ్వరి ఫొటో లేకపోవడంతో బీజేపీ నాయకులు ఒకింత అసహనానికి గురవుతున్నారు. ఈ ప్రశంసాపత్రం జ్ఞాన సరస్వతి పీఠం వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కేఎన్ జ్యోతి, ఎంపీడీవో ఆర్మ్‌స్ట్రాంగ్, టీడీపీ, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

ఆకుల వీర్రాజుకు పరామర్శలు



ఆకుల ఈశ్వరమ్మ చిత్రపటానికి పూలమాలల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ వీర్రాజు, తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సహకార కేంద్ర బ్యాంక్(డీసీసీబీ) మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజును శనివారం పలువురు పరామర్శించారు. ఇటీవల ఆయన మాతృమూర్తి ఆకుల ఈశ్వరమ్మ స్వర్గస్తులైన విషయం విధితమే. ఎమ్మెల్సీ, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, విశ్రాంత డీఆర్‌వో మారిశెట్టి జితేంద్ర తదితరులు ఈశ్వరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆలమూరు ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, కాంగ్రెస్ పార్టీ రూరల్ కన్వీనర్ తాడాల కొండరాజు, మాజీ డిప్యూటీ మేయర్ వాసిరెడ్డి రాంబాబు, శాప్ మాజీ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, రాష్ట్ర నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు యేసు, మాజీ కార్పొరేటర్ గుత్తుల మురళీధర్, గొర్రెల సురేష్, ఇన్నమూరి రాంబాబు, సిటీ, రూరల్ వైఎస్సార్ సీపీ నేతలు, నగర ప్రముఖులు వీర్రాజును పరామర్శించిన వారిలో ఉన్నారు.

జీజీయూలో ప్రపంచ హైడ్రోగ్రఫీ దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కోటేశ్వరరావు

రాజానగరం: పర్యావరణ పరిరక్షణలో కీలకపాత్రను పోషిస్తున్న హైడ్రోగ్రఫీ, ఓషనోగ్రఫీ కోర్సులను అభ్యసించే విద్యార్థులకు ఆయా రంగాల్లో అపార ఉపాధి, ఉద్యోగావకాశాలు ఉన్నాయని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) సివిల్ ఇంజినీరింగ్ హెచ్‌ఓడీ డాక్టర్ పి.వెంకట కోటేశ్వరరావు అన్నారు. జీజీయూలో సివిల్, మైనింగ్ విభాగాల ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ హైడ్రోగ్రఫీ దినోత్సవం జరిగింది. హైడ్రోగ్రఫీ, సముద్ర శాస్త్రాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మైనింగ్ హెచ్‌ఓడీ డాక్టర్ వై.వినోద్‌కుమార్ మాట్లాడుతూ సముద్ర వనరులను సమృద్ధిగా వినియోగించుకోవడంపై అవగాహన కలిగించడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగా సాధనతో మానసిక ప్రశాంతత



యోగా సాధన చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, పోలీసు అధికారులు



యోగా డేలో పాల్గొన్న ఏపీఈపీడీసీఎల్ అధికారులతో నక్కపల్లి శామ్యూల్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): యోగా సాధనతో ఒత్తిడి, ఆందోళన నుంచి ఉపశమనం కలిగి మానసిక ప్రశాంతత పొందవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత మాట్లాడుతూ ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని యోగా, ఒక భూమి, ఒక ఆరోగ్యం అనే థీమ్‌తో ముందుకు వెళ్తున్నామన్నారు. జిల్లా అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ యోగా ద్వారా మానసిక, ఆరోగ్య లాభాలు చేకూరుతాయని అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎల్.చెంచిరెడ్డి, ఏఆర్ డీఎస్పీ రవికుమార్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ అనసూరి శ్రీనివాసరావు, జోనల్ డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, జ్యుడీషియల్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగా సాధనతో ఏకాగ్రత

సీటీఆర్ఐ: యోగా దినచర్యలో భాగంగా సాధనం చేయడం వల్ల ఏకాగ్రత పెరుగుతుందని విశ్రాంత ఆచార్యులు ప్రభల సుబ్రహ్మణ్య శర్మ అన్నారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ తిరుపణ్యం, డాక్టర్ డీవీ రమణమూర్తి, డాక్టర్ పీవీబీ సంజీవరావు పాల్గొన్నారు.

ఒత్తిడి జయించే సాధనం

రాజమహేంద్రవరంసిటీ: ఒత్తిడిని జయించేందుకు సంప్రదాయ యోగాను మించిన సాధనం మరొకటి లేదని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నక్కపల్లి శ్యామ్యూల్ పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక లాలాచెరువు సెంటర్‌లో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో సుమారు 500 మంది ఏపీఈపీడీసీఎల్ అధికారులు, ఉద్యోగులు పాల్గొని యోగాసనాలు సాధన చేశారు. ఏపీఈపీడీసీఎల్ ఈఈలు ఎమ్.రవికుమార్, ఎస్.ఎస్ అప్పారావు, ఎస్ఏఓ ఆదినారాయణ పాల్గొన్నారు.

కడియం మండలంలో..

కడియం: మండలంలోని పలు గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, విద్యార్థులు యోగాసనాలు వేసారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావు అన్నారు. వ్యవసాయ ఉద్యాన శాఖల ఆధ్వర్యంలో సరస్వతి ఘాట్లో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ మాధవరావు, జిల్లా ఉద్యాన శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా యోగా దినోత్సవ వేడుకలు

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక కవలగొయ్యిలోని ఫ్యూచర్ కిడ్స్ గ్లోబల్ పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ రవిబాబు యేలేటి, చైర్‌పర్సన్ విజయ యేలేటి, సీఈవో మహశ్వి యేలేటి తదితరులు పాల్గొన్నారు.

డైట్ కళాశాలలో..

బొమ్మూరులోని జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్)లో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. వ్యాయామోపాధ్యాయుడు రమేష్‌బాబు బోధనా, బోధనేతర సిబ్బంది, ఛాత్రోపాధ్యాయులతో వివిధ యోగాసనాలు వేయించారు. ప్రిన్సిపాల్ డా.ఏఎం జయశ్రీ, అధ్యాపకులు పాల్గొన్నారు. రాజమహేంద్రవరం వ్యవసాయకళాశాలలో అసోసియేట్ డీన్ డా.టి శ్రీనివాస్ యోగా ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ధవళేశ్వరం ప్రభుత్వ ఐటీఐలో ప్రిన్సిపాల్ సీహెచ్.సునీల్‌కుమార్ యోగాపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

ధవళేశ్వరంలో..

ధవళేశ్వరం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని యోగా గురువు తలాటం సూర్యప్రకాశరావు పేర్కొన్నారు. ధవళేశ్వరం ఉడతావారి వీధిలోని శ్రీ వివేకానంద యోగ మందిరం వద్ద శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు.

సినిమాలు



శ్యామల	:	డీ28 ఇయర్స్ లేటర్
సూర్యమినీ	:	8 వసంతాలు
సూర్యప్యాలెస్	:	సితారే జమీన్ పర్
స్వామి	:	కుబేర
అనుశ్రీ	:	కుబేర
శివజ్యోతి	:	కుబేర
ఊర్వశి	:	భైరవం
మేనక	:	సింగిల్
రంభ	:	హౌటు ట్రయిన్ యువర్ డ్రాగన్
అప్సర	:	సితారే జమీన్ పర్
అశోక	:	8 వసంతాలు
నామవరం		
వీఎస్.మహల్	:	కుబేర
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	కుబేర
కడియం		
వెంకటసూర్య	:	కుబేర

నిబద్ధత కలిగిన కార్యకర్త శివానందరెడ్డి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ డాక్టర్ సూర్యనారాయణరెడ్డి



సత్తి శివానందరెడ్డి (ఫైల్)

అనపర్తి: రామవరం గ్రామంలోనే కాకుండా వైఎస్సార్ సీపీ అనపర్తిలో క్రియాశీలకంగా ఉండే సత్తి శివానందరెడ్డి ఆకస్మిక మృతి వారి కుటుంబ సభ్యులకే కాకుండా పార్టీకి తీరని లోటని పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఇటీవల వేమగిరి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో శివానందరెడ్డి మృతి చెందారు వారి కుటుంబ సభ్యులను శనివారం డాక్టర్ సూర్యనారాయణరెడ్డి పరామర్శించారు. ఆయనతో పాటు, మాజీ ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి సుబ్బిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఆదాడి చిన సత్యనారాయణ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.



శివానందరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న డాక్టర్ సూర్యనారాయణరెడ్డి